


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 21 పేజీలు : 4+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి బుధవారం 25 సెప్టెంబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## బ్యాంకు గ్యారెంటీ రూ.1600 కోట్లు.. !

### ఉన్నతాధికారులకు తెలియకుండానే ఏజెన్సీలకు ఇచ్చిన ఈఈ తిరుపతి రావు

- 2022లో వచ్చిన వరదలతో సీసీ బ్లాక్స్ డ్యామేజీ
- అనుకున్న దానికంటే వరద ఎక్కువ రావడంతోనే పగుళ్లు
- నిర్మాణానికి ముందు సైట్లలో ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో పరీక్షలు
- ఓపెన్ కోర్టులో కాళేశ్వరం కమిషన్కు వెల్లడించిన ఇంజినీర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం కమిషన్ ఇవాళ నిర్వహించిన ఓపెన్ కోర్టు విచారణలో అనేక విషయాలు వెల్లడయ్యాయి. ఇవాళ జరిగిన విచారణకు ఐదుగురు ఇంజినీర్లు హాజరయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ తిరుపతి రావు ఉన్నతాధికారులకు తెలియకుండానే ఏజెన్సీలకు రూ.1600 కోట్లకు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారని విచారణకు హాజరైన ఇంజినీర్లు తెలిపారు. డిజైన్లు, డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారని పీసీ ఘోష్ ప్రశ్నించగా.. వ్యాప్కోస్ సంస్థ తయారు చేసిందన్నారు. వాటిని సీడీఓ సీఈ అనుమతితో అమలు చేసినట్లు వివరించారు.

వివరాలు 2లో..





## రేవంత్ కోర్టుకు రావాలి

### ఓటుకు నోటు కేసులో నాంపల్లి కోర్టు ఆదేశం

- విచారణ నలుగురు గైర్హాజరుపై ఆగ్రహం
- మినహాయింపు కోరిన డిఫెన్స్ కౌన్సిల్
- 16వ తేదీకి వాయిదా వేసిన న్యాయస్థానం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటుకు నోటు కేసులో విచారణకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డికి నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నాంపల్లి కోర్టులో ఓటుకు నోటు కేసుకు సంబంధించి నేడు విచారణ జరిగింది. విచారణకు మత్తయ్య హాజరయ్యారు. రేవంత్ రెడ్డి సహా మిగతా నిందితులు విచారణకు గైర్హాజరయ్యారు. రేవంత్ రెడ్డితో పాటు ఉదయ్ సింహా, వేం కృష్ణ కీర్తన్, సండ్ర వెంకటవీరయ్య, సెబాస్టియన్ విచారణకు హాజరు కాలేదు.

వివరాలు 2లో..



## డీజేల విషయంలో త్వరలోనే గైడ్‌లైన్స్ తెస్తం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉరేఘింపులు, శోభాయాత్రలకు డీజేలు పెట్టడం వల్ల శబ్ధ కాలుష్యంతోపాటు నగర వాసులు కూడా ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. త్వరలోనే డీజేలపై ఓ గైడ్‌లైన్స్ తీసుకొస్తామని ఆయన చెప్పారు. గణేష్ నిమజ్జనం, జైనూర్ వివాదాలపై డీజీపీ జితేందర్ మంగళవారం ప్రెస్ మీట్ లో మాట్లాడారు. జైనూర్ ఘటన దురదుష్టకరమని విచారం వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులు చేయి దాటి పోవడంతో ఈ కేసులో 38 మందిని అరెస్ట్ చేశామని, అలసత్వం వహించిన హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో గణేష్ నిమజ్జనం, మీలాద్ ఉన్ నభీ వేడుకలు ప్రశాంతంగా పూర్తి చేసేందుకు పోలీస్ డిపార్ట్ మెంట్ బాగా కృషి చేశారని డీజీపీ మెచ్చుకున్నారు. బందోబస్తులో15,400 మంది వివిధ జిల్లాల పోలీస్

వివరాలు 2లో..

# నిర్లక్ష్యం.. సహించం..

### సాగర్ ఎడమ కాల్వ మరమ్మతులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ఇంకా ఎన్ని రోజులు చేస్తరు
- ఇంజినీర్లపై ఎందుకు చర్య తీసుకోవద్దు
- సాగర్ ఎడమ కాల్వ మరమ్మతులపై ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** నాగార్జున సాగర్ ఎడమ కాల్వ మరమ్మతు పనుల్లో జాప్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఇంకా ఎన్నిరోజులు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని చెప్పారు. పనుల్లో జాప్యానికి కారణమైన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో తెలుపాలన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురం వద్ద నాగర్జున సాగర్ ఎడమ కాలువకు గండిపడింది.

గండి పూడ్చివేత పనులు గత వారం ప్రారంభమయ్యాయి

ఆ పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా.. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.. గండిపూడ్చివేత పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే గండి పూడ్చివేత పనులు ఆలస్యం అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.





## విద్యాశాఖకు మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ

- డీఎస్సీ ఫలితాల విడుదలపై జాప్యం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్స్ వేదికగా ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత
- జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు జరిగిన డీఎస్సీ పరీక్షలు
- టీచర్ల అవసరం ఉందంటూ ప్రభుత్వం హడావుడిగా పరీక్షలు నిర్వహించిందన్న ఆర్ఎస్పీ

వివరాలు 2లో..



## వైసీపీకి ఊహించని దెబ్బ.. రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో అధికారం కోల్పోయిన వైసీపీకి మరో షాక్ తగిలింది. వైసీపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్న ఆర్.కృష్ణయ్య తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ ఆయన రాజీనామాను ఆమోదించారు. కృష్ణయ్య రాజీనామాతో ఏపీ నుంచి రాజ్యసభ స్థానం ఖాళీ అయింది. బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకే రాజీనామా చేశానని ఆర్.కృష్ణయ్య చెప్పారు. 100 బీసీ సంఘాలతో చర్చించిన తర్వాతే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఏపీ నుంచి ఒక స్థానం ఖాళీ అయినట్లు రాజ్యసభ కార్యాలయం నుంచి బులిటెన్ విడుదల చేశారు.

2022లో ఏపీలో వైసీపీ అధికారంలో

వివరాలు 2లో..

## 16 ఏళ్ల నిరీక్షణకు తెర: 2008 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్

**హైదరాబాద్ పెన్ పవర్:** 2008 డీఎస్సీ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 2008 డీఎస్సీలో నష్ట పోయిన బీఈడీ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వాలని

వివరాలు 2లో..






## ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కు మద్దతు ప్రకటించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

- సనాతన ధర్మంపై పవన్ వ్యాఖ్యలను సమర్ధించిన బీజేపీ ఎంపీ
- పవన్ శక్తిమంతమైన మాటలు మాట్లాడారన్న బండి సంజయ్
- సనాతనం ధర్మ జోలికొస్తే మౌనంగా ఉండబోమన్న కేంద్ర సహాయ మంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:** "హిందూ ధర్మం జోలికి ఎవరూ రావొద్దు. హిందువులకు మనోభావాలు ఉండవా? ఆలయాలలో అపవిత్రమైన పనులు జరుగుతుంటే చూస్తూ ఊరుకోవాలా...

వివరాలు 2లో..

## పార్టీ మారిన ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండే

- రైతు భరోసా కాదు.. సీఎం కుర్చీకే భరోసా లేదు
- మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండే అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్వరలో 10 చోట్ల ఉప ఎన్నికలు తప్పవని.. డ్రామాలతో ఎక్కువ కాలం రాజకీయం నడవదు అన్నారు. తాము నిర్మాణాలు చేస్తే, కాంగ్రెస్ వాటిని కూల్చుతోందని ఆరోపించారు. సీఎం రేవంత్ సోదరుడికి ఓ న్యాయం, సామాన్యులకు ఓ న్యాయమా అని ప్రశ్నించారు. రైతు భరోసా కాదు.. ముఖ్యమంత్రి కుర్చీకే భరోసా లేదు' అని సెటైర్లు వేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ 'మంత్రి శ్రీధర్ బాబు

వివరాలు 2లో..



## శ్రీలంక కొత్త ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రమాణం

- అమరసూర్యతో ప్రమాణం చేయించిన దేశాధ్యక్షుడు
- బండారు నాయకే తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మహిళా నేత అమరసూర్య
- కేబినెట్ మంత్రులుగా మరో ఇద్దరు ప్రమాణం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# భారత్ కు దూరమేనా....

అనుర కుమార దిసనాయకే... వామపక్ష భావాలున్న ఒక నాయకుడు శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇదే తొలిసారి.అనుర కుమార దిసనాయకే, జనతా విముక్తి పెరమునె (జేవీపీ) పార్టీకి చెందినవారు. లోతైన వామపక్ష భావజాలం కలిగిన పార్టీగా జేవీపీ పేరుగాంచింది.ఎక్కువగా మధ్యేవాద, మితవాద నాయకులే పాలిస్తున్న శ్రీలంకను ఇప్పుడు ఒక వామపక్ష నాయకుడు పాలించనుండటం అక్కడి రాజకీయల్లో వచ్చిన చెప్పుకోదగిన మార్పు.జేవీపీకి ఉన్న భారత వ్యతిరేక వైఖరి.. వామపక్ష ధోరణి కారణంగా దిసనాయకే ప్రభుత్వం ఇప్పుడు శ్రీలంకను చైనాకు చేరువ చేసి, భారత్‌కు దూరం చేస్తుందా? అనేది చాలామందికి కలుగుతున్న ప్రశ్న.అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 38 మంది అభ్యర్థులు పోటీ చేశారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి శ్రీలంక చరిత్రలో తొలిసారి ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సి వచ్చింది.దిసనాయకే, పొరుగు దేశాలైన చైనా, భారత్‌లతో ఎలా వ్యవహరిస్తారనేది కీలకంగా మారనుంది.జనతా విముక్తి పెరమునెకి భారతదేశంపై అనుకూల దృక్పథం లేదు. లంక అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి అనుర కుమార దిసనాయకే అందరి దృష్టినీ ఆకర్షించారు.గత ఎన్నికల్లో కేవలం 3 శాతం ఓట్లకే పరిమితమైన ఈయన, ఈసారి ఏకంగా అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు.అనుర కుమార దిసనాయకే 1968 నవంబర్ 24న అనురాధపురం జిల్లాలోని తంబుతెగామ ప్రాంతంలో జన్మించారు.తంబుతెగామ కామినీ మహా విద్యాలయం, తంబుతెగామ సెంట్రల్ కాలేజీలో చదువుకున్నారు. ఆ తర్వాత పెరదేనియా యూనివర్సిటీలో చేరారు.అనుర కుమారకు చదువుకునే రోజుల నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేది.ఈయన 19 ఏళ్ల వయసులో, శ్రీలంకలోని వామపక్ష పార్టీ జనతా విముక్తి పెరమునె(జేవీపీ)లో చేరారు.అనంతరం పెరదేనియా యూనివర్సిటీ నుంచి బయటికొచ్చేసి, కెళని యూనివర్సిటీలో చేరారు.జేవీపీ ఈయన్ను సోషలిస్ట్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నేషనల్ ఆర్గనైజర్‌గా నియమించింది. ఆ పార్టీ సెంట్రల్ వర్కింగ్ కమిటీలోనూ చోటు కల్పించింది.2000లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.ముఖ్యంగా 1980లలో, శ్రీలంక వ్యవహారాల్లో భారతదేశ ప్రమేయాన్ని ఆ పార్టీ తీవ్రంగా విమర్శించింది. శ్రీలంక అంతర్యుద్ధం సమయంలో తమిళ వేర్పాటువాద ఉద్యమాలకు మద్దతు ఇవ్వడంలో భారత్ పాత్ర వారికి నచ్చలేదు.శ్రీలంక విషయంలో భారత్ ఆధిపత్య వైఖరిని ప్రదర్శించిందని జేవీపీ ఆరోపించింది.వామపక్ష ధోరణి కారణంగా దిసనాయకే సహజంగా భారత్ కంటే చైనా వైపు ఎక్కువ మొగ్గు చూపుతారనేది సాధారణ భావన.శ్రీలంక పట్ల భారత్ అనుసరిస్తున్న విధానాన్ని కూడా జనతా విముక్తి పెరమునె చాలా కాలం విమర్శించింది.శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ప్రచారం చివరి దశలో సెప్టెంబర్ 16న జరిగిన రాజకీయ చర్చా కార్యక్రమంలో భారత్‌పై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.ఒకవేళ తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే శ్రీలంకలో అదానీ గ్రూపు పెట్టుబడులున్న పవన విద్యుత్ ప్రాజెక్టును రద్దు చేస్తానని ఆయన అన్నారు.శ్రీలంక సార్వభౌమత్వానికి ఈ ప్రాజెక్ట్ విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు.ఈ పరిణామాలన్నీ అనుర కుమార దిసనాయకేపై భారత్‌కు వ్యతిరేకి అనే ముద్ర వేశాయి.భారత్‌పై జేవీపీకి వ్యతిరేక వైఖరి ఉన్నప్పటికీ, 'దిసనాయకే'ను భారత విధానకర్తలు దూరం పెట్టలేదు.భారత్ కొంతకాలం నుంచి దిసనాయకేతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ ఏడాది ఆరంభంలో ఆయనను భారత్‌కు ఆహ్వానించింది. భారత్‌లోని కీలక నాయకులతో ఆయన సమావేశమయ్యారు. శ్రీలంక కొత్త అధ్యక్షుడితో సంబంధాలు కొనసాగించడానికి భారత్ ఆసక్తితో ఉందని దీన్నిబట్టి అర్థం అవుతోంది. తమ పొరుగు దేశాల్లో జరిగే పరిణామాల గురించి భారత్ ఎప్పుడూ జాగ్రత్తగా ఉంటుంది" అని ప్రొఫెసర్ జేవియర్ అన్నారు.భారత ప్రభుత్వం ఫిబ్రవరిలో దిసనాయకేను దిల్లీకి ఆహ్వానించింది. ఆయన అప్పుడు పంజాబ్‌లో కూడా పర్యటించారు. చాలామంది ప్రముఖ నేతలను కలిశారు. భారత్ పట్ల జేవీపీకి ఉన్న చారిత్రక వైఖరి గురించి వారికి స్పష్టంగా తెలుసు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల విషయంలో భారత్ మొదటి నుంచి అప్రమత్తంగానే ఉంది.అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నప్పుడు శ్రీలంకలోని భారత రాయబారి సంతోష్ ఝా మాట్లాడుతూ.. "మేం ఏ అభ్యర్థికీ మద్దతు ఇవ్వడం లేదు. ఎవరు గెలిచినా కొత్త అధ్యక్షుడితో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు.దిసనాయకేను సంతోష్ ఝా వ్యక్తిగతంగా కలవడం అనేది శ్రీలంక కొత్త ప్రభుత్వంతో కలిసి పనిచేయాలనే భారత ప్రభుత్వ ఉద్దేశాన్ని చాటుతోంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దిసనాయకేకు శుభాకాంక్షలు తెలిపారు.దిసనాయకే, భారత్‌ల మధ్య కీలక వివాదాంశం శ్రీలంకలోని అదానీ పవన విద్యుత్ ప్రాజెక్ట్. 2023 ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్టును ఆమోదించారు.తన ఎన్నికల ప్రచార సభల్లో దిసనాయకే ఈ ప్రాజెక్టును ప్రస్తావించారు.శ్రీలంక సార్వభౌమత్వానికి ఈ ప్రాజెక్ట్ విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు.భారత్‌కు చెందిన అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ఈ ప్రాజెక్టులో 442 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 3,700 కోట్లు) పెట్టుబడి పెడుతోంది. మన్నార్, పూనగారిలో విండ్ ఫార్మ్‌ను అభివృద్ధి చేస్తోంది.పర్యావరణం, విద్యుత్ అధిక ధరల కారణంగా అనేక వర్గాల నుంచి ఈ ప్రాజెక్టుపై వ్యతిరేకత వ్యక్తమవుతోందిఇప్పుడు దిసనాయకే కూడా ఈ ప్రాజెక్టును వ్యతిరేకించడంతో భారత వ్యతిరేక వైఖరిని అనుసరించే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు.'అదానీ ప్రాజెక్టు విషయానికొస్తే అదొక వివాదాస్పద అంశం. జేవీపీ మాత్రమే కాకుండా పర్యావరణ బృందాలు, ఇతర రాజకీయ పార్టీలు కూడా దీనిపై ఆందోళనల వ్యక్తంచేశాయి. కాబట్టి ఈ విషయంలో దిసనాయకే వ్యతిరేకతను మొత్తంగా భారత వ్యతిరేక వైఖరిగా చూడకూడదు. మోదీ, అదానీలు ఈ ప్రాజెక్టును పునఃపరిశీలించాలి" అని కొలంబో యూనివర్సిటీ ఎమెరిటస్ ప్రొఫెసర్ జయదేవ ఉయాంగోడ అన్నారు.ఈఅంశంపై జాఫ్నా యూనివర్సిటీకి చెందిన అహిలాన్ కదిర్‌గామర్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.దిసనాయకే విదేశాంగ విధాన నిర్ణయాలను ప్రభావితం చేసే మరో కీలక అంశం శ్రీలంక ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభం.పెరుగుతున్న ద్రవ్యోల్బణం, విదేశీ నిల్వలు అడుగంటడం, అంతర్జాతీయ రుణదాతల వద్ద భారీగా తీసుకున్న అప్పుల కారణంగా శ్రీలంకకు ఇప్పుడు వీలైనంత సహాయం అవసరం

# విద్యాశాఖకు మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ ఫలితాల విడుదలపై చేస్తున్న జాప్యం విషయమై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశ్నించారు. అసలు ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు ఎవరు...? ఆయన ఏ ప్రపంచంలో సేదతీరుతున్నారు..? విద్యాశాఖ మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే ఫైర్ అయ్యారు.ఉపాధ్యాయుల అవసరం ఉందంటూ హడావుడిగా పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఫలితాలు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు.

తెలంగాణ ప్రభుత్వం ఆగమేఘాల మీద డీఎస్సీ పరీక్షలు జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ (సీబీటీ) లో నిర్వహించిందని, చాలా మంది అభ్యర్థులు వాయిదా వేయాలని వేడుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. తొందరగా టీచర్ల అవసరముందని ప్రభుత్వం హడావుడిగా పరీక్షలు నిర్వహించిందని ఆరోపించారు.

అంతా ఆన్‌లైన్ పరీక్ష అయినప్పుడు దీనికి సంబంధించిన నియామక భర్తీ ప్రక్రియ ఎందుకు నత్త నడకన సాగుతోంది అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అభ్యర్థులకు ఫలితాలు తొందరగా ఇచ్చి, జనరల్ ర్యాంకింగ్స్ ప్రకటించి, నియామక పత్రాలు అందజేస్తే వారు త్వరగా బడులకు వెళ్లి పిల్లలకు పాఠాలు బోధిస్తారని ఆయన తెలిపారు. వారం రోజుల్లో డీఎస్సీ ఫలితాలు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని, అలాగే సెప్టెంబర్ 5వ తేదీ వరకు నియామకాలు చేపడుతామని కూడా హామీ ఇచ్చారని... కానీ అమలుకు నోచుకోవడం లేదని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాలోని సొమ్మును కొడంగల్, ఢిల్లీకి తరలించినట్లు అనిపిస్తుందని పేర్కొన్నారు. అందుకే జీతాలకు డబ్బుల్లేక, గురుకుల టీచర్లకే ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఇక డీఎస్సీ టీచర్లకు ఎక్కడ్నుంచి తీసుకొచ్చి ఇవ్వాలనే ధోరణిలో ప్రభుత్వం ఉందన్నారు. హైడ్రా పేరుతో అందరి దృష్టి మళ్లించి, వచ్చే ఏడాది నియామక పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నట్లు అనిపిస్తుందని ఆయన తెలిపారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండే

- మొదటి పేజీ తరువాయి

అతి తెలివి ప్రదర్శించొద్దు. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకున్నారని మాట్లాడారు. ఎమ్మెల్యేలకు కండువా కప్పిన సన్నాసి ఎవరు? గరీబోళ్ల మీద ముఖ్యమంత్రి పగ బట్టాడు. తొమ్మిదిన్నర నెలలో రియల్ ఎస్టేట్ దందా కాంగ్రెస్‌చేసింది ఏంటి? దమ్ముంటే నిర్మాణాలకు పర్మిషన్లు ఇచ్చిన వాళ్ల మీద చర్యలు తీసుకో. ముందు పట్నం మహేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్మాణాలు కూల్చు. హైడ్రా బాధితులకు అండగా ఉండేందుకు కార్యాచరణ తీసుకుంటాం. ముఖ్యమంత్రి ఆయన సోదరులు, బంధువులు హైదరాబాద్ మీద పడి స్వైర విహారం చేస్తున్నారు. అన్ని విషయాలు త్వరలోనే బయటకు వస్తాయి. రాష్ట్రం మొత్తం కేసీఆర్ రావాలనే రోజు మళ్లీ వస్తది' అని అన్నారు.

# వైసీపీకి ఊహించని దెబ్బ.. రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా

- మొదటి పేజీ తరువాయి

ఉండగా ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు ఎన్నిక కావడం గమనార్హం. రాజ్యసభ ఎంపీగా ఆయన పదవీ కాలం సుమారు నాలుగేళ్లు ఉన్నప్పటికీ ఆయన రాజీనామా చేశారు. ఆర్.కృష్ణయ్య రాజకీయంగా కూడా కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వైసీపీ నుంచి రాజ్యసభ ఎంపీలుగా ఎన్నికైన మోపిదేవి, బీద మస్తాన్ రావు కూడా ఇప్పటికే రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తెలంగాణలోని వికారాబాద్ జిల్లాకు చెందిన ఆర్.కృష్ణయ్య 2014లో ఎల్బీనగర్ నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. గత 35 ఏళ్లుగా బీసీ ఉద్యమ నేతగా కీలక పాత్ర పోషించారు. ఇదిలా ఉండగా.. ఏపీలో 2024లో అధికారం కోల్పోయిన

వైసీపీకి ఇటీవల షాకుల మీద షాకులు తగులుతున్నాయి. బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను వైసీపీకి ఇటీవల గుడ్ బై చెప్పి జనసేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఈ ఇద్దరూ పవన్‌తో భేటీ అయ్యారు. తాజాగా రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య కూడా రాజీనామా చేయడంతో వైసీపీలో కలకలం రేగింది.

# 16 ఏళ్ల నిరీక్షణకు తెర: 2008 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నిర్ణయించింది. ఆ డీఎస్సీలో అర్హత సాధించి ఉద్యోగం పొందని బీఈడీ అభ్యర్థులకే ఈ అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్న ప్రభుత్వం.. హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఇవాళ (సెప్టెంబర్ 24) ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నెల 27 నుండి అక్టోబర్ 5వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా శాఖ స్పష్టం చేసింది. కాగా, 2008 డీఎస్సీ బాధితులు దాదాపు 2 వేల వరకు ఉండగా.. ప్రభుత్వ తాజా నిర్ణయంతో దాదాపు 16 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఇన్నాళ్లు కాళ్ల చెప్పులరిగేలా అధికారులు, ఆఫీస్‌ల చుట్టూ తిరిగామని.. ఇప్పటికైనా తమ గోడును అర్థం చేసుకుని ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరిచడంతో 2008 డీఎస్సీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీలంక కొత్త ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రమాణం

**పెన్ పవర్ డెస్క్:**శ్రీలంక కొత్త ప్రధానిగా 54 ఏళ్ల హరిణి అమరసూర్య నియమితులయ్యారు. ఈరోజు ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. నేషనల్ పీపుల్స్ పవర్‌కు చెందిన 54 ఏళ్ల హరిణి అమరసూర్యతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. మరో ఇద్దరిని కేబినెట్ మంత్రులుగా నియమించారు. సిరిమావో బండారు నాయకే తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణి అమరసూర్య కావడం గమనార్హం. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక శాఖ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలక శాఖలను కేటాయించారు.అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేశ్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేశారు. శ్రీలంకలో హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి ఆ దేశ మూడో మహిళా ప్రధానిగా చరిత్రను సృష్టించారు. సిరిమావో బండారునాయకే, చంద్రికా కుమారతుంగ తర్వాత మరో మహిళ శ్రీలంక ప్రధాని పీఠం అధిష్ఠించడం ఇదే ప్రథమం.

# జానీ మాస్టర్ కస్టడీ పిటిషన్‌పై విచారణ పూర్తి... తీర్పు వాయిదా

**పెన్ పవర్ డెస్క్:**లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన జానీ మాస్టర్ కస్టడీ పిటిషన్‌పై రంగారెడ్డి కోర్టులో వాదనలు పూర్తయ్యాయి. కోర్టు... తీర్పును రేపటికి వాయిదా వేసింది. జానీ మాస్టర్‌ను ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని నార్సింగి పోలీసులు నిన్న పిటిషన్ దాఖలు చేశారు. ఈ కస్టడీ పిటిషన్‌పై కోర్టు ఈరోజు విచారణ జరిపింది. విచారణ అనంతరం తీర్పును వాయిదా వేసింది.ఓ మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో ఈ నెల 19న నార్సింగి పోలీసులు గోవాలో అరెస్ట్ చేశారు. పీటీ వారెంట్‌పై

గోవా నుంచి అతనిని హైదరాబాద్‌కు తరలించారు. ఆ తర్వాత అతనిని రంగారెడ్డి కోర్టులో హాజరుపరచడంతో... కోర్టు అతనికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది.

## రేవంత్ కోర్టుకు రావాలి

- మొదటి పేజీ తరువాయి

నిందితులు విచారణకు గైర్హాజరు కావడంపై నాంపల్లి కోర్టు అసహనం వ్యక్తం చేసింది. అయితే నేటి విచారణకు మినహాయింపు ఇవ్వాలని నిందితులు కోర్టును అభ్యర్థించారు. వారి అభ్యర్థనను కోర్టు అంగీకరించింది. అక్టోబర్ 16న విచారణకు హాజరు కావాలని రేవంత్ రెడ్డి సహా నిందితులకు కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# బ్యాంకు గ్యారెంటీ రూ.1600 కోట్లు.. !

- మొదటి పేజీ తరువాయి

ఈఎన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశం మినిట్స్ అనుసరించకుండానే వీటిని విడుదల చేసినట్లు వారు వివరించారు. అయితే బ్యారేజీల డ్యామేజ్‌కు అనుకున్నదానికంటే ఎక్కువ వరద రావడం వల్లే సీసీ బ్లాక్ దెబ్బతిన్నట్లు వివరించారు. 2022 జులైలో వచ్చిన భారీ వరదల వల్ల సీసీ బ్లాక్‌లు పాడైనట్లు తెలిపారు. ఈ డ్యామేజీ జరిగిన వెంటనే ఏజెన్సీలకు లేఖలు రాశామని కమిషన్‌కు వివరించారు. నిర్మాణానికి ముందు సైట్లలో ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగినట్లు ఇంజినీర్లు వివరించారు.

# డీజేల విషయంలో త్వరలోనే గైడ్‌లైన్స్ తెస్తం

- మొదటి పేజీ తరువాయి

సిబ్బంది పాల్గొన్నారు.- 12వేల మంది ట్రైనీ ఎస్సై, కానిస్టేబుల్ లను కూడా బందోబస్తులో వినియోగించారు. 5,879 నిమజ్జనం పాయింట్లు ఏర్పాటు చేసి.. కంట్రోల్ రూంలు, డీజీపీ కార్యాలయం నుంచి మానిటర్ చేశమని ఆయన తెలియజేశారు.

# ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కు మద్దతు ప్రకటించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

- మొదటి పేజీ తరువాయి

సనాతన ధర్మంపై అడ్డగోలుగా మాట్లాడితే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదు" అంటూ ఇవాళ (మంగళవారం) ఇంద్రకీలాద్రి వేదికగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిప్పులు చెరిగిన సంగతి తెలిసిందే. తాజాగా, పవన్ కల్యాణ్ కు కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శక్తిమంతమైన మాటలు మాట్లాడారని, సంపూర్ణంగా ఆయనకు మద్దతుగా నిలుస్తానని బండి సంజయ్ పేర్కొన్నారు." సనాతన ధర్మంతో ఎవరైనా పెట్టుకుంటే మా హిందువులమంతా న్యాయబద్ధంగా గొంతు విప్పుతాం. లౌకికవాదం అనేది రెండు మార్గాలు ఉన్న వీధి లాంటిది. ఇతరులు మమ్మల్ని కొడుతుంటే దెబ్బలు తింటామని భావిస్తున్నారేమో అది జరగదు. పంచింగ్ బ్యాగ్స్ మాదిరిగా మౌనంగా ఉండబోము" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.ఈ మేరకు ఎక్స్ వేదికగా బండి సంజయ్ స్పందించారు. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్. ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని జోడించారు.

# రైతుల సంక్షేమం అజెండాగా ప్రజా ప్రభుత్వం కృషి....

- రైతుల పూర్తి ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి పంటల బీమా పథకం అమలు
- మద్దులపల్లి మార్కెట్ పూర్తి చేసేందుకు 20 కోట్లు మంజూరు
- అక్టోబర్ నెలలో నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం
- రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 24:** ..రైతుల సంక్షేమం అజెండాగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు అన్నారు. మంత్రులు ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రుల సమక్షంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడుగా నియమించబడిన సీతారాములు, ఉపాధ్యక్షులుగా నియమితులైన సురేష్, ఇతర పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గతం కంటే మెరుగ్గా రైతులు, పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వంలో పాటు పడతామని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరంలోనే 31 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ మాత్రమే నని అన్నారు.మన రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల రుణమాఫీ క్రింద 18 వేల కోట్లను మాఫీ చేశామని మంత్రి తెలిపారు.2 లక్షల పైన ఉన్న రుణాలు ఉన్న రైతులకు షెడ్యూల్ ప్రకటించి రుణమాఫీ పూర్తి చేస్తామని అన్నారు. రుణమాఫీ పూర్తయిన రైతులకు కొత్త అప్పులు వస్తాయని అన్నారు. తెల్ల రేషన్ కార్డు లేని రైతు లను కుటుంబ సర్వే ద్వారా నిర్ధారణ చేసి రుణమాఫీ పథకం వర్తింప చేస్తామని అన్నారు. దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, సన్నాలు పండించే రైతులకు క్వింటాళ్ల 500 రూపాయల బోనస్ ప్రకటించామని అన్నారు.

రైతుల పంటలకు కూడా పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. రుణమాఫీ పథకం తర్వాత రైతు భరోసా పథకం అమలు అవుతుందని అన్నారు. క్వింటాల్ కు వెయ్యి రూపాయలు నష్టం వచ్చినప్పటికీ తడిచిన పెసర్లను మద్దతు ధర పై కొనుగోలు చేశామని తెలిపారు. మొక్కజొన్నలు, సోయా, పొద్దు తిరుగుడు, కందులు, ఎర్ర జొన్నలు మొదలగు పంటలకు మార్కెట్ లో ధర లేని సమయంలో వేల కోట్ల నష్టం వచ్చినప్పటికీ రైతులను నిలబెట్టాలని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.నేలకొండపల్లి మార్కెట్ మంచి పనితీరు కనబరుస్తుందని, దీని అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో మంజూరు చేసిన మద్దులపల్లి మార్కెట్ పూర్తి చేసేందుకు 20 కోట్ల మంజూరు చేశామని మంత్రి తెలిపారు.

అమెరికా రోడ్ల మాదిరిగా ఖమ్మం రోడ్లను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు వస్తుందని అన్నారు. ప్రతి నెల 400 కోట్లు ఖర్చు చేసి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. భక్త రామదాసు ఎత్తిపోతల పథకం పూర్తి చేసి 70 వేల ఎకరాల సాగునీరు అందించామని అన్నారు.కరువు ప్రాంతంగా ఉన్న పాలేరు నియోజకవర్గాన్ని అత్యంత సాగునీరు వసతి కలిగిన ప్రాంతంగా తీర్చిదిద్దామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఉన్న నదుల మీద చెక్ డ్యాంలు, బ్రిడ్జి లు కట్టామని అన్నారు. ఇంటింటికి నల్లా పెట్టి త్రాగునీరు అందించామని అన్నారు. పామాయిల్ సాగు చేసి మరింత లాభం పొందాలని మంత్రి తెలిపారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంగా ప్రమాణం చేసిన నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతూ, రైతులకు ఏ కష్టం వచ్చినా పార్టీలకతీతంగా అక్కున చేర్చుకొని పనిచేయాలని, వచ్చిన పదవికి మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా, వరంగల్ జిల్లా, సూర్యాపేట, నల్గొండ జిల్లాలు నష్టపోయాయని అన్నారు. సీఎం వరద ప్రాంతాలలో పర్యటించి పునరావాస చర్యలు, వరద సహాయక చర్యలు పర్యవేక్షించారని, కేంద్ర ప్రభుత్వం నుంచి రూపాయి సహాయం రాకపోయినా, నష్టపోయిన ప్రతి ఇంటికి 16,500 రూపాయల ఆర్థిక సహాయం పంపిణీ చేశామని అన్నారు.

వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఎకరానికి 10 వేల పరిహారం అందజేస్తామని అన్నారు. వరదల వల్ల నీటిపారుదల రంగంలో అనేక చెరువులు, సాగర్ కాలువ 4 చోట్ల దెబ్బ తిన్నప్పటికీ యుద్ధ ప్రాతి పదికన పునరుద్ధరణ పనులు పూర్తి చేశామని అన్నారు. పాలేరు దిగువన ఉన్న రైతాంగానికి కూడా సాగు నీరు అందిస్తామని అన్నారు.

చెరువుల ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్లలో పెద్ద పెద్ద బంగ్లాలు కట్టుకున్న బడా బాబుల నిర్మాణాలపై హైకోర్టు అనేకసార్లు అక్షింతలు వేసినప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని, అక్రమ నిర్మాణాలను తొలగిస్తుందని అన్నారు.

రాష్ట్రంలో చాలా కాలంగా రేషన్ కార్డుల పంపిణీ జరగలేదని, ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందించేందుకు అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు 500 రూపాయల బోనస్ ప్రకటిస్తున్నామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు రాయల నాగేశ్వరరావు, మువ్వ విజయ్ బాబు, సాదు రమేష్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం బహిరంగ విచారణ...



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ కరీంనగర్, సెప్టెంబర్ 24:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలు- డిజైన్ లోపాలు .. అవినీతి ఆరోపణలపై నిజాల నిగ్గు తేలే టైమ్ వచ్చేసిందా? జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆధ్వర్యంలో ఎంక్వయరీ పీక్స్‌కు చేరింది. ఇప్పటికే కీలక డేటా సేకరించిన కమిషన్.. బహిరంగ విచారణ చేస్తోంది. తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై చర్యలు తప్పవని స్ట్రాంగ్‌మెసేజ్ పాస్ చేసింది కమిషన్. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ లోపాలు.. ఆర్థిక అవకతకలపై విచారణ మరింత వేగవంతమైంది. ఈరోజు నుంచి ఐదురోజుల పాటు కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ జరపనుంది. కాళేశ్వరం ప్రాజెక్టుల్లో డిజైన్ లోపాలు.. బిల్లుల చెల్లింపుల అక్రమాలు జరిగియానే ఆరోపణలపై శనివారం కల్లా కన్‌క్లూజన్‌కు వచ్చే అవకాశం ఉంది.కాళేశ్వరం ప్రాజెక్టుల మాటున అవినీతి ఎత్తిపోతలు ఆరోపణలు, అభియోగాలపై నిజానిజాలు తెరపైకి వచ్చే టైమ్ వచ్చేసింది. జస్టిస్ చందరఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ ఆధ్వర్యంలో విచారణ స్పీడందుకుంది ఇప్పటికే మాజీ ఈఎన్సీ సహా ఏడుగురు సీఈ స్థాయి ఇంజినీర్లను ఆరా తీసింది. ప్రాజెక్టుల డిజైన్ వంటి టెక్నికల అంశాలపై కూడా సమాచారం సేకరించింది . ఆర్థిక అవతకవలపై దృష్టిసారించిన కమిషన్? పనులు పూర్తవ్వకుండానే బిల్లులు ఎలా చెల్లించారంటూ అధికారులను ప్రశ్నించింది. ఒత్తిళ్లపై కూడా పిన్ పాయింట్‌గా ఫోకస్ పెట్టింది.. ఇక ఇవ్వాల్టి నుంచి . ఇంజనీర్లు,అకౌంట్స్ అధికారులను బహిరంగంగా ప్రశ్నించనుంది కమిషన్. ఐదు రోజులు కొనసాగనున్న ఈ విచారణలో ఇంజినీర్లు, అకౌంట్స్ అధికారులపై ప్రశ్నలు సంధించనుంది కమిషన్.ముందుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు సంబంధించి 40 మంది ఇంజనీర్లు విచారణకు హాజరవుతారు. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ రిజిస్టర్, ఎంబుక్‌లను కూడా తీసుకురావాలని ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేసింది కమిషన్. ఈ వారంలోనే ఇఔఅలను విచారణకు పిలవనుంది కమిషన్. ఇక తుది నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ కు ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే కాగ్ అధికారుల నుంచి కూడా సమగ్రంగా వివరాలు సేకరించనుంది కమిషన్. కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించి అన్ని నివేదకలను ఇవ్వాలని ఇప్పటికే ఇరిగేషన్ శాఖను ఆదేశించింది కమిషన్.తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ అల్రెడీ స్పష్టం చేసింది. తప్పుడు సమాచారం ఇచ్చినా.. నిజాలను దాచి పెట్టాలని ప్రయత్నించినా అలాంటి వారిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు పెట్టడం సహా భవిష్యత్‌లో వారికి ఎలాంటి పదోన్నతులు ఇవ్వొద్దని ప్రభుత్వానికి సిఫార్సు చేసే అవకాశం వుంది. కాళేశ్వరం కమిషన్ విచారణలో దాదాపు తుది దశకు చేరుకుంది. శనివారం కల్లా పూర్తి స్థాయి నివేదకను సమర్పిస్తుందా? ఇప్పటి వరకు జరిగిన విచారణలో ఎలాంటి అంశాలను గుర్తించారు. డిజైన్ల లోపం.. బిల్లుల చెల్లింపుల అక్రమాలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ఎలాంటి రిపోర్ట్ ఇవ్వనుందనేది ఆసక్తికరంగా మారింది.

# శ్రద్ధ వాకర్ తరహాలోనే మహా లక్ష్మి హత్య



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ బెంగళూరు, సెప్టెంబర్ 24:** ఢిల్లీలో శ్రద్ధా వాకర్ తరహాలో బెంగళూరులో మహాలక్ష్మి అనే మహిళ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది.. బెంగళూరు నగరంలోని వయాలికావల్‌లో నివసిస్తున్న 29ఏళ్ల మహిళను దారుణంగా హత్య చేసి 30కి పైగా ముక్కలు చేసి ఫ్రీజర్‌లో దాచారు.. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. శరీరం ముక్కలుగా నరికి రిఫ్రిజిరేటర్‌లో ఉంచారని.. కుళ్లిపోయిన స్థితిలో శరీర భాగాలు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆమెను హత్యచేసి.. 30 ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచిపెట్టిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఆమెను హత్యచేసిన వ్యక్తి ఎవరో గుర్తించారు. అతడ్ని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. బెంగళూరు నగర కమిషనర్ దయానంద్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాన నిందితుడ్ని గుర్తించామని చెప్పారు. అతడిది వేరే రాష్ట్రమని అన్న ఆయన.. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తు?నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉండగా ఇంతకంటే వివరాలను వెల్లడించలేమని ఆయన అన్నారు.హతురాలు మహాలక్ష్మి.. మల్లేశ్వరంలోని ఓ మాల్‌లో పనిచేస్తూ.. భర్తకు దూరంగా ఉంటోంది. అయితే, ఒక వ్యక్తి రోజూ వచ్చి ఆమెను తీసుకెళ్లి.. మళ్లీ దింపుతాడని స్థానికులు ద్వారా పోలీసులకు తెలిసింది. దీంతో అతడే ఈ హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గుర్తించడానికి 4-5 రోజుల ముందు హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఫ్రిజ్‌లో మహాలక్ష్మి ఛిద్రమైన అవశేషాలు చూసి కుటుంబసభ్యులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు.అయితే, నిందితుడితో పాటు బాధితురాలిది వేరే రాష్ట్రమని, కర్ణాటకలో ఉంటున్నారని పోలీస్ కమిషనర్ చెప్పారు. కాగా, ఈ కేసుపై కర్ణాటక హోమ్ మంత్రి జి పరమేశ్వర మాట్లాడుతూ.. పోలీసులు ప్రధాన నిందితుడ్ని గుర్తించారని, అతడి సొంత రాష్ట్రం పశ్చిమ బెంగాల్ అని అన్నారు. అలాగే, పూర్తి వివరాలను దర్యాప్తు తర్వాత వెల్లడిస్తామని ఆయన చెప్పారు. అలాగే, నగరంలో మహిళ భద్రత గురించి తీసుకుంటున్న చర్యల గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఈ విషయంలో మేము చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై మేము అప్రమత్తంగా ఉన్నామని మంత్రి పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తు మరింత వేగవంతంగా జరుగుతోంది.అయితే.. మహాలక్ష్మి హత్య కేసులో ప్రధాన నిందితుడిని గుర్తించినట్లు బెంగళూరు పోలీసు కమిషనర్ బి దయానంద సోమవార తెలిపారు. ఈ కేసులో అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని, ప్రధాన నిందితుడిని గుర్తించామని, అతడిని అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడిన కమిషనర్ దయానంద పలు కీలక విషయాలను వెల్లడించారు. నిందితుడు బయటి రాష్ట్రంలో ఉన్నాడని.. తాము చెప్పే విషయాలు నిందితులకు సహాయపడే అవకాశం ఉన్నందున ప్రస్తుతానికి మరింత సమాచారం ఇవ్వలేమని తెలిపారు.అంతకుముందు రోజు కర్ణాటక హోం మంత్రి జి పరమేశ్వర మాట్లాడుతూ.. మహిళ మృతికి సంబంధించి పోలీసులు చాలా సమాచారాన్ని సేకరించారన్నారు. హత్య వెనుక పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తి ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారని, అయితే అతని పాత్రను నిర్ధారించడానికి మరిన్ని ఆధారాలు అవసరమని మంత్రి అన్నారు.మహాలక్ష్మి అనే మహిళ గత ఐదు నెలలుగా బెంగుళూరులోని వయాలికావల్‌లోని వినాయక నగర్‌లో ఒంటరిగా నివాసముంటోంది.. తన భర్త హుకుమ్ సింగ్ నేలమంగళలో నివసిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఒంటరిగా నివసిస్తోంది.. సెప్టెంబరు 21న ఆమె నివసిస్తున్న ఇంటి ఫ్రిజ్‌లో ఆమె శరీర భాగాలను కుళ్లిపోయిన స్థితిలో గుర్తించారు. దుర్వాసన రాకుండా రసాయనాలు చల్లి ఇంటికి తాళం వేసి పరారైనట్లు తెలిపారు. అయితే బాధితురాలి ఫోన్ సెప్టెంబర్ 2న అయిందని, అదే రోజు హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

## సామాన్యుల బ్రతుకుల్లో మట్టి కొడుతున్నారు



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్ సెప్టెంబర్24:** సీఎం రేవంత్ రెడ్డికియ ఏం మానవత్వం వుందని ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నించారు. వారి కాళ్ళ మీద వారు బ్రతుకుతున్న సామాన్యుల బ్రతుకుల్లో మట్టి కొట్టి, వారి జీవితాలు నిప్పులు పోసి నువ్వు ఏం సాధిస్తామని రేవంత్ రెడ్డిని అడుగుతున్నాను. పేదల ఇళ్లను కులగొట్టి వారి ఆస్తులను ధ్వంసం చేసిన దుర్మార్గపు ప్రభుత్వం ఎక్కడ తప్పించుకోలేదని అన్నారు. బాధితులను ఈటల రాజేందర్ పరామర్శించారు.

## ముందస్తు నోటీసులిచ్చిన తరువాతే కూల్చివేతలు

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ సంగారెడ్డి సెప్టెంబర్24:** ముందస్తు సమాచారమిచ్చిన తర్వాతే ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా సహకారంతో కూల్చివేతలు చేపట్టామని అమీన్ పూర్ తహశీల్దార్ రాధా చెప్పారు. ఈ భవనాలపై 2022 నుంచే రెవెన్యూ శాఖ పోరాటం చేస్తోందని, పలుమార్లు కూల్చివేసినా ఆ యజమానులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేశారన్నారు. ఒక్కరోజులో నోటీసులిచ్చి మరుసటి రోజు కూల్చివేస్తున్నారంటూ తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారన్నారు. కిష్టారెడ్డిపేటలోని 164 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో మూడు భారీ భవనాలు, పటేల్ గూడ సర్వే నంబర్ 12, 208 ఇల్లీగల్ లే అవుట్ లో నిర్మించిన 26 ఇళ్లను కూల్చివేశామన్నారు. మరో ఐదు ఇళ్లల్లో నివాసం ఉంటున్నారని వాటిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. వీటిపై మూడేళ్లుగా రెవెన్యూ శాఖ పలుమార్లు నోటీసులు ఇచ్చి చర్యలు సైతం తీసుకుందన్నారు. ప్రభుత్వం, హైడ్రా పూర్తి సహకారంతో పూర్తిగా నేలమట్టం చేశామని, ప్రభుత్వ అధికారులు చాలా విశ్వసనీయతతో పనిచేస్తామన్నారు. ప్రజలు సహకరిస్తే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసే బాధ్యత మాది అని తహశీల్దార్ రాధా చెప్పారు. మున్ముందు మరిన్ని కూల్చివేతలు ఉండనున్నట్లు తెలిపారు.

## చిరు వ్యాపారాలను సహకార బ్యాంకులు ప్రోత్సహించాలి

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్ సెప్టెంబర్24:** ప్రధాని మోదీ ప్రభుత్వం ఎంఎస్ ఎంఈ ద్వారా అందిస్తున్న వడ్డీ లేని రుణాలు మాదిరిగా సహకార బ్యాంకులు చిరు వ్యాపారులకు. చిన్న తరహా పరిశ్రమలకు అందించి ప్రోత్సాహించాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కోరారు. మలక్ పేట లో నిర్వహించిన తిరుమల బ్యాంక్ 27వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తక్కువ వడ్డీ రేట్లకు రుణాలందించే సహకార బ్యాంకు ద్వారా పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో సహకార బ్యాంకింగ్ వ్యవస్థ తనదైన ముద్రను వేసిందని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్ అందిస్తున్న సేవలను కొనియాడారు. చిన్న బ్యాంకుల మీద ఎక్కువ దృష్టి పెట్టాలని, చిన్న వినియోగదారులకు చక్కటి సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్, గోపికృష్ణ మానేపల్లి, రామన్న దొర,హరిహర కుమార్, బ్యాంక్ డైరెక్టర్లు, ఖాతాదారులు, వినియోగదారులు తదితరులు హాజరయ్యారు. అనంతరం మొబైల్ యాప్ ను ప్రారంభించారు.

## లవర్ కోసం వచ్చి అడ్డంగా దొరికి పోయాడు




**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ తిరుపతి, సెప్టెంబర్ 24:** చిత్తూరు జిల్లాలో విచిత్రమైన ఘటన జరిగింది.. ఓ యువకుడు లేడీస్ హాస్టల్‌లోకి చొరబడటం కలకలంరేపింది. మనోడు అడ్డంగా దొరికిపోయిన తర్వాత.. లేడీస్ హాస్టల్‌లోకి ఎందుకు వెళ్లావని అడిగితే యువకుడు చెప్పిన సమాధానం విని అందరూ అవాక్కయ్యారు.

కేరళలోని త్రిసూర్‌కు చెందిన ఓ విద్యార్థిని గుడుపల్లెలోని కాలేజీలో ఉన్న హాస్టల్‌లో ఉంటోంది.. ఆమె నర్సింగ్ సెకండియర్ చదువుతోంది. కేరళలోని త్రిసూర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బెంగళూరులో కుకింగ్ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు.నర్సింగ్ చదువుతున్న యువతి, కుకింగ్ పనులు చేస్తున్న యువకుడు.. రెండేళ్ల క్రితం కేరళలో కలిసి చదువుకోగా.. ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ఇద్దరు ప్రేమించుకున్నారు. అయితే ప్రియురాలు హాస్టల్‌లో ఉండటంతో ఆమెను చూడాలనిపించింది.. వెంటనే బెంగళూరులో బయల్దేరి కుప్పం చేరుకున్నాడు. ఇటు ప్రియురాలు హాస్టల్‌లో ఉండటంతో.. ఆమెను కలిసేందుకు వీలు లేకుండా పోయింది. ఎలాగైనా ప్రియురాలిని కలవాలని మాస్టర్ ప్లాన్ వేశాడు.. మారు వేషంలో లేడీస్ హాస్టల్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు,హాస్టల్ సిబ్బందికి అనుమానం రాకుండా సినిమా స్టైల్‌లో ప్లాన్ చేశాడు. ఒక బురఖా కొనుగోలు చేసి.. దానిని ధరించి తన ప్రియురాలిని కలిసేందుకు లేడీస్ హాస్టల్‌లోకి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ హాస్టల్ సిబ్బందికి ఎందుకో అనుమానం వచ్చింది.. వెంటనే అప్రమత్తమై అనుమానంతో తనిఖీ చేయగా యువకుడు అడ్డంగా దొరికిపోయాడు. కాలేజీ సిబ్బంది అతడిని పట్టుకుని ఒక గదిలో ఉంచారు.. ఆ తర్వాత కాలేజీ యాజమన్యం సూచన మేరకు ఆ యువకుడ్ని పోలీసులకు అప్పగించారు. లేడీస్ హాస్టల్‌లోకి ఎందుకు వెళ్లావని కాలేజీ సిబ్బంది, పోలీసులు ప్రశ్నించగా.. తన ప్రియురాలిని కలవడం కోసం వెళ్లానని సమాధానం చెప్పడంతో అక్కడున్న వాళ్లంతా అవాక్కయ్యారు. కాలేజీ వైస్ ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఎక్కడో బెంగళూరులో ఉంటూ ఉపాధి పొందుతున్న యువకుడు.. ప్రియురాలిని కలుద్దామని వచ్చి పిచ్చి ప్లాన్‌తో అడ్డంగా దొరికిపోయాడు.. అనవసరంగా జైలు పాలయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలంరేపింది.

## వేగంగా కారు నడపవద్దన్నందుకు కట్టెలతో దాడి

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ యాదాద్రి** అతివేగంగా కారు నడుపుతున్న యువకులను మందలించినందుకు కత్తులతో ముగ్గురిని గాయపరిచిన దుర్గటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో చోటు చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం శుభాకార్యానికి వచ్చిన సరూర్ నగర్ ప్రాంతానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించి వేగంగా వాహనం నడుపుతున్నారు. వారిని వాహనాన్ని ఆపి మందలించిన స్థానిక కౌన్సిలర్ దండ అరుణ్, చింటూ, సురేందర్ ల పై కట్టులతో దాడి చెశారు. స్థానిక ప్రజలు వెంటనే గాయపడిన ముగ్గిరిని హాస్పిటల్ తరలించారు అలాగే గాయపరిచిన వారిలో ఇద్దరినీ గాయపరిచగా మరో ఇద్దరినీని పోలీసులకు అప్పగించిగా ఒకరు పరారీ ఉన్నాడు. దాడి చేసిన స్థానికులతో దెబ్బలు తిన్న ఇద్దరు అలాగే గాయపడిన ముగ్గురు మొత్తం ఐదుగురుని కామినేని హాస్పిటల్ లో చికిత్స పొందుటున్నారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# భారత క్రికెట్‌కు జస్ప్రీత్ బుమ్రా 'కోహినూర్ వజ్రం': రవిచంద్రన్ అశ్విన్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెటర్లలో అత్యంత ఫిట్ ప్లేయర్ తానేనని పేసర్ జస్ప్రీత్ బుమ్రా చెప్పడం పట్ల నెట్టింట మిశ్రమ స్పందన వస్తోంది. ఇతర క్రికెటర్ల అభిమానులు అతడిపై ట్రోల్ చేస్తున్నారు.

తాజాగా ఈ విషయమై రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. భారత క్రికెట్‌కు బుమ్రా ఓ కోహినూర్ వజ్రం అని పేర్కొన్నాడు. భారత జట్టు కిరీటంలో కలికితురాయి అని బుమ్రాపై ప్రశంసల జల్లు కురిపించాడు. అతనిపై విమర్శలు చేసినవారికి అశ్విన్ కాస్త చురకలు కూడా అంటించాడు.

### అసలు ఏం జరిగిందంటే..?

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుమ్రా తన ఫిట్నెస్‌పై మాట్లాడాడు. టీమిండియాలో ఎవరు అత్యుత్తమ ఫిట్‌నెస్‌తో ఉంటారు? అని అడిగితే, దానికి బుమ్రా తన పేరే చెప్పుకున్నాడు. దానికి కారణం కూడా చెప్పాడు.

"మీరు వెతుకుతున్న సమాధానం నాకు తెలుసు. కానీ నేను ఫాస్ట్ బౌలర్ కాబట్టి నా పేరు చెప్పాలనుకుంటున్నాను" అని బుమ్రా అన్నాడు. అయితే, అందరూ కోహ్లీ పేరు చెబుతాడని అనుకున్నారు. దీంతో ఫిట్‌నెస్ విషయంలో కోహ్లీ కంటే ఎక్కువ స్థాయిలో ఉంటాడా అని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో కామెంట్స్ వెల్లువెత్తాయి. భారత క్రికెట్‌లో ఫిట్‌నెస్ ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరిచిందే కోహ్లీ అని, ఎప్పుడూ గాయాల బారినపడే బుమ్రా ఎలా ఫిట్‌గా ఉన్నట్లు? అంటూ కాంట్రావర్సీకి దారితీసింది.

### ఈ ఫిట్‌నెస్ చర్చపై బుమ్రాకు అశ్విన్ మద్దతు

ఈ చర్చలో బుమ్రా వ్యాఖ్యలను స్పిన్నర్ సమర్థించాడు. 2022లో గాయం కారణంగా బుమ్రా ఫిట్‌నెస్‌పై విమర్శలు చేసే ముందు టిప్పర్ లారీ, మెర్సిడెస్ బెంజ్ మధ్య వ్యత్యాసాన్ని అభిమానులు అర్థం చేసుకోవాలని అశ్విన్ పేర్కొన్నాడు. ఇక గాయం కారణంగా ఆ ఏడాది ఆస్ట్రేలియాలో జరిగిన టీ20 ప్రపంచకప్‌కు స్టార్ పేసర్ దూరమైన విషయం తెలిసిందే.

### బుమ్రాను టిప్పర్ లారీతో పోల్చిన అశ్విన్

అశ్విన్ తన అభిప్రాయాన్ని వివరించడానికి బుమ్రాను టిప్పర్ లారీతో పోల్చాడు. "బుమ్రా గాయపడ్డాడని మీరు టక్కున చెబుతారు. అతను ఫిట్‌గా ఎలా ఉండగలడు? బాస్.. టిప్పర్ లారీ, మెర్సిడెస్ బెంజ్ మధ్య చాలా తేడా ఉంది. టిప్పర్ లారీ దేశం మొత్తం తిరుగుతుంటుంది. భారీ లోడ్‌ను కూడా మోసుకెళ్తుంది. ఫాస్ట్ బౌలర్ కూడా టిప్పర్ లారీ లాండివాడే. ఒక్కోసారి బ్రేక్‌డౌన్ అవుతుంది. అదే బెంజ్ కారును చాలా జాగ్రత్తగా నడుపుతుంటాం" అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

### బుమ్రాను 'కోహినూర్ ఆఫ్ ఇండియా' అని ప్రశంసించిన అశ్విన్

బుమ్రాను అశ్విన్ భారత క్రికెట్‌కు కోహినూర్ వజ్రంగా పేర్కొన్నాడు. ఫాస్ట్ బౌలర్‌ను తన ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి అనుమతించాలని అతను కోరాడు. "మీరు ఈ విషయాన్ని ఎందుకు పెద్దది చేయాలనుకుంటున్నారు? జస్ప్రీత్ బుమ్రా ఒక ఫాస్ట్ బౌలర్. అతను మండే ఎండలలో కూడా గంటకు 145 కి.మీ. వేగంతో బంతులను సంధించగలడు. భారత క్రికెట్‌కు అతడు రత్న కిరీటం" అని అశ్విన్ అన్నాడు.

# ఇరానీ ట్రోఫీ..శార్దూల్ ఈజ్ బ్యాక్.. రహానేకే పగ్గాలు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరానీ ట్రోఫీకి రంగం సిద్ధమైంది. లక్నో వేదికగా భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో అక్టోబర్ 1 నుంచి 5 వరకు జరుగుతుంది. రంజీ ట్రోఫీ విన్నర్ ముంబైతో ఈ మ్యాచ్ లో రెస్టాఫ్ ఇండియా తలబడుతుంది. ముంబై జట్టును రంజీ ట్రోఫీ విజేతగా నిలిపిన రహానే ఇరానీ కప్ లోనూ ముంబైకు కెప్టెన్ గా కొనసాగనున్నాడు. శస్త్ర చికిత్స తర్వాత చాలా నెలల తర్వాత శార్దూల్ ఠాకూర్ ఈ మ్యాచ్ ఆడనున్నాడు.

శ్రేయాస్ అయ్యర్, ముషీర్ ఖాన్, షామ్స్ ములానీ , తనుష్ కొటియన్ లాంటి స్టార్ ప్లేయర్లు ఈ మ్యాచ్ లో ఆడనున్నారు. ప్రస్తుతం భారత జట్టు స్క్వాడ్ లో ఉన్న సర్ఫరాజ్ ఇరానీ కప్ కోసం కాన్పూర్ నుండి లక్నోకు వెళ్లే అవకాశముంది. కాన్పూర్ టెస్ట్ ప్రారంభమైన తర్వాత కూడా సర్ఫరాజ్ లక్నోకు బయలుదేరవచ్చు. చివరి నిమిషంలో ఎవరైనా గాయపడితే తప్ప సర్ఫరాజ్ జట్టు నుంచి రిలీజ్ అవ్వడం దాదాపుగా ఖాయంగా కనిపిస్తుంది. స్టార్ ప్లేయర్లు అందరూ చేరడంతో ముంబై బలంగా కనిపిస్తుంది.టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే ఇటీవల ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. ఇరానీ కప్ మ్యాచ్ నాటికి రహానే పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరానీ ట్రోఫీని చివరి మూడు సార్లు రెస్టాఫ్ ఇండియానే గెలిచింది. ముంబై చివరిసారిగా 1998 లో ఇరానీ కప్ ను అందుకుంది. ఈ సారి స్టార్ ప్లేయర్లు అందరూ అందుబాటులో ఉండడంతో ముంబై టైటిల్ గెలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# బంగ్లాతో రెండో టెస్ట్.. సచిన్, బ్రాడ్‌మన్ రికార్డులపై కన్నేసిన కోహ్లీ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ బంగ్లాదేశ్ తో జరగబోయే రెండో టెస్ట్ మ్యాచ్ లో రెండు రికార్డ్స్ పై కన్నేశాడు. వీటిలో ఒకటి మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ రికార్డ్ కాగా.. మరొకటి ఆల్ టైం గ్రేట్ బ్యాటర్ బ్రాడ్ మాన్ ది. ఇప్పటివరకు కోహ్లీ తన అంతర్జాతీయ క్రికెట్ లో 26965 పరుగులు చేశాడు. మరో 35 పరుగులు చేస్తే అంతర్జాతీయ క్రికెట్ లో వేగంగా 27000 పరుగులు పూర్తి చేసుకుంటాడు. ఇప్పటివరకు ఈ రికార్డ్ సచిన్ పై ఉండగా... కోహ్లీ ఈ రికార్డ్ బ్రేక్ చేయడం ఖాయంగా కనిపిస్తుంది.

సచిన్ టెండూల్కర్,కుమార్ సంగక్కర,రికీ పాంటింగ్ మాత్రమే ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్ లో 27000 పరుగులు చేశారు. ఫీల్డర్ గాను టెస్ట్ క్రికెట్ లో మరో మూడు క్యాచ్ లు తీసుకుంటే సచిన్ ను అధిగమిస్తాడు. అదే జరిగితే టెస్ట్ క్రికెట్ లో భారత్ తరపున అత్యధిక క్యాచ్ లు అందుకున్న మూడో ఫీల్డర్ గా నిలుస్తాడు. ఈ ఫార్మాట్‌లో రాహుల్ ద్రవిడ్ భారత్ తరపున అత్యధిక క్యాచ్‌లు (210) అందుకున్నాడు. వీవీఎస్ లక్ష్మణ్ 135 క్యాచ్‌లతో రెండవ స్థానంలో ఉన్నాడు.టెస్ట్ క్రికెట్ లో ఇప్పటివరకు 29 సెంచరీలు చేసిన కోహ్లీ.. మరో సెంచరీ చేస్తే బ్రాడ్ మాన్ సెంచరీల రికార్డ్ అధిగమిస్తాడు. బ్రాడ్ మన్, కోహ్లీ సంయుక్తంగా 29 సెంచరీలు సెంచరీలు చేశారు. ప్రస్తుతం టెస్ట్ క్రికెట్ లో కోహ్లీ పెద్దగా ఫామ్ లో కనిపించడం లేదు. గత రెండేళ్లలో అతని యావరేజ్ బాగా తగ్గిపోయింది. ఇటీవలే బంగ్లాతో ముగిసిన తొలి టెస్టులో తొలి ఇన్నింగ్స్ లో 6.. రెండో ఇన్నింగ్స్ లో 17 పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ వేదికగా రెండో టెస్ట్ ప్రారంభమవుతుంది.



ఇషా అద్భుతమైన రెడ్

# రాశీ వన్స్ మోర్.. స్టన్నింగ్ పిక్స్ చూశారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీ బ్యూటీ రాశీ ఖన్నా.. యూత్ లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న విషయం తెలిసిందే. మద్రాస్ కేఫ్ మూవీతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అమ్మడు.. మనం సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఊహలు గుసగుసలాడే చిత్రంతో హీరోయిన్ గా మారింది. ఆ సినిమాలో తన యాక్టింగ్ తో అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుసగా తెలుగు చిత్రాల్లో యాక్ట్ చేసింది. మధ్యలో విలన్ మూవీతో మలయాళం సినీ ఇండస్ట్రీలో తన లక్ ను టెస్ట్ చేసుకుంది. ఇమైక్కా నొడిగల్ సినిమాతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన రాశీ ఖన్నా.. ఓ రేంజ్ లో క్రేజ్ సంపాదించుకుంది. బాలీవుడ్ లో కూడా అడుగుపెట్టి తన సత్తా చాటింది. అలా కోలీవుడ్, బాలీవుడ్, మాలీవుడ్ లో నటిస్తోంది అమ్మడు. ప్రస్తుతం చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 2024లో ఇప్పటికే యోధ, అరణ్మనై 4 సినిమాలతో పలకరించింది. త్వరలో గోద్రా రైలు దహన కాండ ఆధారంగా రూపొందుతోన్న ది సబర్మతీ రిపోర్ట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది రాశీ ఖన్నా. %ూశ్రీంశీ =ఝుం% - మహేష్ కొత్త లుక్.. ఈ హాలీవుడ్ స్టార్ స్ఫూర్తి? నవంబర్ 15న విడుదల కానున్న ఆ మూవీలో కీలక పాత్ర పోషిస్తోంది అమ్మడు. తెలుగులో చివరగా పక్కా కమర్షియల్ సినిమాతో సందడి చేసింది. ఆ తర్వాత ఇప్పటి వరకు కనిపించలేదు. ఇప్పుడు తెలుసు కదా మూవీ చేస్తోంది. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా తెరకెక్కుతున్న ఆ సినిమాలో కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. రాశీ ఖన్నా సెకండ్ హీరోయిన్ గా మెరవనుంది. లాంగ్ బ్యాక్ తర్వాత టాలీవుడ్ లో సందడి చేయనుంది అమ్మడు. %ూశ్రీంశీ =ఝుం% - అతడిపై దాడి ఆరోపణలు నిరాధారం.. ఖండించిన నటి అయితే కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా.. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో మైమరపిస్తుంటోంది రాశీ ఖన్నా. క్లీవేజ్, థైస్ షోతో నెట్టింట ఎప్పటికప్పుడు హీట్ పుట్టించే పిక్స్ షేర్ చేస్తుంటోంది. గ్లామర్ డోస్ బాగా పెంచేసి.. రకరకాల ఫోటో షూట్స్ పోస్ట్ చేస్తూ కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టిస్తుంటోంది. తన అందచందాలతో నెట్టింట భారీ ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. తన గ్లామరస్ పిక్స్ తో ఆకట్టుకుంటూ.. కుర్రాళ్ల మతులు పోగుడుతుంటోంది రాశీ ఖన్నా. %ూశ్రీంశీ =ఝుం% - పొట్టి వైట్ సూట్ లో రష్మిక స్టన్నింగ్! తాజాగా క్రేజీ పిక్స్ షేర్ చేసింది. ఫ్లోరల్ డ్రెస్ వేసుకున్న బ్యూటీ.. టీ తాగుతూ నేచర్ ను ఎంజాయ్ చేస్తున్న ఫోటో పోస్ట్ చేసింది. మరోసారి థైస్ షోతో సెగలు రేపింది. వేరే లెవల్ లో అందాలు ఆరబోసింది. నవ్వుతోనే మాయ చేసింది. ప్రస్తుతం ఆమె కొత్త పిక్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నారు. మేడమ్ సార్ మేడమ్ అంతే అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. లవ్ సింబల్స్ తో కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. లైకుల వర్షం కురిపిస్తున్నారు.



నలుపు రంగులో అనన్య కొత్త లుక్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com